క్లుప్తంగా

గ్రామ సచివాలయంలో ప్రైవేట్ వ్యక్తి హల్‌చల్



రేషన్ కార్డులు తనిఖీ చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి

మార్కాపురం టౌన్: మండలంలోని పెద్దనాగుల వరం గ్రామ సచివాలయంలో ఉద్యోగులు కూర్చునే కుర్చీలో ఓ ప్రైవేట్ వ్యక్తి దర్జాగా ఆసీను డయ్యాడు. స్మార్ట్ రైస్ కార్డులు పరిశీలిస్తూ అధికార దర్పం ప్రదర్శించాడు. మంగళవారం దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సచివాలయ ఉద్యోగులు చేయాల్సిన పనిలో ప్రైవేట్ వ్యక్తులు తలదూర్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై తహసీల్దార్ చిరంజీవిని వివరణ కోరగా పక్కనే వీఆర్వో ఉన్నారని, ఈ సంఘటనపై విచారణ చేస్తున్నామని తెలిపారు.

జీఎస్టీపై వ్యాపారులకు అవగాహన



వ్యాపారులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీఓ, కార్యదర్శులు

కంభం: జీఎస్టీ సక్రమ అమలుతో వ్యాపారాభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీడీఓ వీరభద్రాచారి పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని పలు దుకాణాల వద్ద సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పన్ను విధానం, వస్తువుల ధరలపై జీఎస్టీ ప్రభావం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శనగ విత్తనాలకు పేర్లు నమోదు చేసుకోండి

కంభం: శనగ విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవా కేంద్రాల్లో వీఏఏలను సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని వ్యవసాయాధికారి మహమ్మద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి 1150 క్వింటాళ్ల శనగ విత్తనాలు కేటాయించారని పేర్కొన్నారు. శనగ విత్తనాలు క్వింటా ధర రూ.7,800 కాగా రాయితీపోను రూ.5850కు అందజేయనున్నట్లు తెలిపారు.

డీజేలు వాడొద్దు

దొనకొండ: మండల పరిధిలోని గ్రామాల్లో శుభ కార్యాలు, తిరునాళ్లు, ఇతర కార్యక్రమాలకు డీజేల వినియోగానికి అనుమతులు లేవని ఎస్‌ఐ టి.త్యాగరాజు స్పష్టం చేశారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ అనుమతులు పొందిన వారు మైకు లేదా సౌండ్ బాక్స్‌లు పరిమితి సంఖ్యలో ఏర్పాటు చేసుకోవాలన్నారు. అనుమతులు లేకుండా ఎవరైనా ఏర్పాటు చేసుకుంటే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామాల్లో ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే అలాంటి వారిని గుర్తించి సంబంధిత పోలీసుస్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

ఆటోకూ పోటు!

'ఆటో డ్రైవర్ సేవలో' అంటూనే కూటమి సర్కారు మోసం

- ఆదిలోనే అడ్డగోలు నిబంధనలతో దరఖాస్తుల తిరస్కరణ
- అన్ని అర్హతలు ఉన్నా కొర్రీలు పెట్టి లబ్ధిదారుల జాబితాకు కత్తెర
- మార్కాపురం ఎంవీఐ పరిధిలో 4047 దరఖాస్తులకు 3944 ఆమోదం
- డబ్బు జమ చేసింది కేవలం 1800 మంది ఆటో డ్రైవర్లకే..
- నగదు ఖాతాలో పడలేదని సచివాలయాల చుట్టూ డ్రైవర్ల చక్కర్లు



మార్కాపురం టౌన్:

సంక్షేమ పథకాల అమలులో కూటమి ప్రభుత్వ డొల్లతనం వరుసగా బట్టబయలవుతూనే ఉంది. కూటమి ప్రభుత్వ మేనిఫెస్టోలో పేర్కొన్న హామీలు అన్నీ నెరవేర్చామని గొప్పలు చెబుతున్న టీడీపీ నేతలు వాస్తవాలను కప్పిపుచ్చేందుకు డైవర్షన్ డ్రామాలకు తెరతీయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వాహనమిత్ర పథకం ద్వారా అర్హులైన ప్రతి ఆటోడ్రైవర్‌కు 10 వేల రూపాయలను నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి షరతులు లేకుండానే నేరుగా వారి బ్యాంక్ ఖాతాలకు జమ చేసిన విషయం తెలిసిందే. అయితే వాహనమిత్ర పథకం పేరును కూటమి ప్రభుత్వంలో ఆటో డ్రైవర్ సేవలో.. అని మార్పు చేసి అడ్డగోలుగా నిబంధనలు విధించడంతో అర్హులైన వారు సైతం దూరమయ్యారు. ఒక్కో ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు ఇస్తున్నామని గొప్పగా ప్రచారం చేసుకున్న సర్కారు.. డ్రైవర్ల బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయడంలో మాత్రం ఘోరంగా విఫలమైంది. పథకాన్ని కేవలం కొందరికే పరిమితం చేయడంతో అసలు ఏం జరుగుతోందో అంతుపట్టక డ్రైవర్లు తలపట్టుకుంటున్న దుస్థితి. పలువురు ఆటో డ్రైవర్లు డబ్బు జమ అవుతుందని ఆశతో ఎదురు చూసినా ఫలితం లేకపోవడంతో నిరాశ, నిస్పృహలో కూరుకుపోయారు. మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభించినప్పటి నుంచి ఆటోలకు సక్రమంగా బాడుగలు లేవని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు విధించే చలానాలు కట్టలేక, ఇంకో వైపు ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందక సతమతం అవుతున్నారు.

2144 మందికి మొండిచేయి

మార్కాపురం పట్టణంలో, మండలంలో సుమారు 3 వేల మందికి పైగా ఆటో డ్రైవర్లు ఉండగా కేవలం 1800 మందికి మాత్రమే వారి ఖాతాల్లో నగదు జమైంది. మిగిలిన వారు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వివిధ కారణాలతో తిరస్కరించారు. పథకం అమలు చేసి నెల రోజులు దాటినా డ్రైవర్ల ఖాతాల్లో నగదు జమకాకపోవడంతో గ్రామ/వార్డు సచివాలయాల చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. మార్కాపురం మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం పరిధిలో మొత్తం 4047 మంది ఆటో డ్రైవర్లు పథకానికి దరఖాస్తు చేసుకోవగా 3944 మందికి ఆమోదం తెలిపారు. కానీ వారిలో 1800 మందికి మాత్రమే నగదు అందించి మిగిలిన 2144 మందికి మొండి చేయి చూపారు.

ఎందుకు రాలేదో అర్థం కావడంలేదు



నాకు 15 వేలు జమ అవుతాయని ఎదురు చూశాను. రాలేదు. సచివాలయానికి వెళ్లి అన్ని పత్రాలు ఇచ్చి దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎందుకు డబ్బు పడలేదో అర్థం కావడం కాలేదు. కుటుంబ పోషణ కోసం ఆటో తోలుతున్నాను. పెరుగుతున్న ఖర్చులు భరించలేకపోతున్నాం. అధికారులు స్పందించి ఆటో డ్రైవర్లకు నగదు జమ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం.

– జి.శ్రీనివాసులు, ఆటో డ్రైవర్, గజ్జలకొండ

బాడుగలు లేక ఇబ్బందులు



ఆటో డ్రైవర్ సేవలో పథకం కోసం సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకున్నా. అన్ని సర్టిఫికెట్లు కరెక్టుగా ఉన్నా నా అకౌంట్‌లో 15 వేల రూపాయలు మాత్రం పడలేదు. ఇలా ఎందుకు జరిగిందో అంతుబట్టడం లేదు. ఒక వైపు పోలీసు చలానాలు, మరో వైపు పెట్రోల్ అధిక ధరలతో విలవిల్లాడుతున్నాం. మహిళలకు ఉచిత బస్సు పెట్టాక ఆటోలకు బాడుగలు రాక ఇబ్బంది పడుతున్నాం.

– షేక్ సుబానీ, ఆటో డ్రైవర్

అర్హులైనవారికి డబ్బు జమ చేయాలి



చాలా మంది ఆటో డ్రైవర్లకు అన్ని అర్హతలు ఉండి దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు రూ.15 వేల నగదు జమకాలేదు. ప్రభుత్వం వెంటనే స్పందించి మా అకౌంట్లలో డబ్బులు జమ చేయాలి. మరో వైపు ఉచిత బస్సుల వల్ల బాడుగలు లేక ఇబ్బందులు పడుతున్నాం. పరిస్థితి అర్థం చేసుకుని సాయం చేయాలి.

– డి.మీరావలి, ఆటోడ్రైవర్, పోతలపాడు

హామీ ప్రకారం డ్రైవర్లందరికీ డబ్బులివ్వాలి



ఆటో డ్రైవర్లందరికీ ప్రభుత్వం 15 వేల రూపాయల నగదు అందించాలి. ఎటువంటి షరతులు లేకుండా ప్రభుత్వం డ్రైవర్లకు ఆర్థిక సాయం అందిస్తామన్న హామీని నిలబెట్టుకోవాలి. ఇప్పటికే చాలా మంది డ్రైవర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఆటో డ్రైవర్ల కష్టాన్ని ప్రభుత్వం గమనించి చేయూతనివ్వాలి.

– షేక్ ఖాశిం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, మార్కాపురం

నకిలీ మద్యంతో ప్రమాదంలో ప్రజారోగ్యం

- గిద్దలూరు లో వైఎస్సార్ సీపీ శ్రేణుల నిరసన
- నకిలీ మద్యాన్ని అరికట్టాలని ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం అందజేత



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గిద్దలూరు రూరల్:

కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమలా మార్చారని, బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెడుతున్నారని వైఎస్సార్ సీపీ గిద్దలూరు పట్టణ అధ్యక్షుడు మానం బాలిరెడ్డి విమర్శించారు. నకిలీ మద్యంపై వైఎస్సార్ సీపీ పోరుబాట కార్యక్రమంలో భాగంగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కేపీ నాగార్జునరెడ్డి ఆదేశాల మేరకు పట్టణంలోని వైఎస్సార్ సీపీ నాయకులు మంగళవారం పెద్ద ఎత్తున నిరసన తెలియజేశారు. ముందుగా రాచర్ల గేట్ సెంటర్‌లో గల వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడ నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా «నారా వారి సారా వద్దు.. నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలు తీయవద్దు» అని నినాదాలు చేశారు. నకిలీ మద్యాన్ని అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఎక్సైజ్ సీఐ ఎం.జయరావుకు వినతి పత్రాన్ని అందజేశారు. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడే నకిలీ మద్యాన్ని నివారించాలని కోరారు. నకిలీ మద్యం కుంభకోణంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని, నకిలీ మద్యం తాగి ప్రాణాలు కోల్పోయిన వారిని గుర్తించి వారి కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గంలో విచ్చలవిడిగా ఏర్పాటు చేసిన బెల్టుషాపులను తొలగించి, యువత మద్యానికి బానిసలుగా మారకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కల్తీ మద్యం వల్ల అమాయక ప్రజలు తమ నిండు ప్రాణాలు కోల్పోవడం చాలా బాధాకరమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బి.ఓబుల రావు, పార్టీ నాయకులు గోడి వెంకటేశ్వరరెడ్డి, పాలుగుళ్ల నరసింహారెడ్డి, స్వామిరంగారెడ్డి, యర్రం వెంకటరామిరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నంద్యాల బాలసుబ్రమణ్యంయాదవ్, పాలుగుళ్ల సుబ్బారెడ్డి, దేవదాసు, మత్తయ్య, మహేష్‌రెడ్డి, మిత్రారెడ్డి, శివ కోటేశ్వరరెడ్డి, సునిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎక్సైజ్ సీఐకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు



కాట్రగుంటలో నిండిన పెద్దమ్మ కుంట

నిండు కుండలా పెద్దమ్మ కుంట

కొనకనమిట్ల: వాతావరణ ప్రభావంతో కొనకనమిట్ల మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా ఓ మోస్తరు వర్షం కురుస్తోంది. కాట్రగుంటలో పెద్దమ్మ కుంటకు నీరు చేరడంతో నిండు కుండలా మారింది. పేరారెడ్డిపల్లి సమీపంలోని తాటిమాను వాగు, పెద్దవాగు పొంగి పొర్లాయి. ఈ నీరంతా తువ్వపాడు చెరువుకు చేరడంతో రైతులు సంతోషం వ్యక్తం చేశారు.



పేరారెడ్డిపల్లి వద్ద తాటిమాను వాగు ఉధృతి

భక్తుల సొమ్ముతో ఆలయాలు నిర్మిస్తే నష్టమేంటి?

మార్కాపురం: భక్తుల సొమ్ముతో హిందూ దేవాలయాలు నిర్మిస్తే తప్పేమిటని పీసీసీ అధ్యక్షురాలు షర్మిలను మార్కాపురం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి పీవీ కృష్ణారావు ప్రశ్నించారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. టీటీడీ నిధులతో దళితవాడల్లో దేవాలయాలు నిర్మిస్తుంటే.. ఆ సొమ్మును సేవలకు ఉపయోగించండని షర్మిల చెప్పడం సబబు కాదన్నారు. రాష్ట్రంలో కేవలం హిందూ దేవాలయాల నుంచి వచ్చే సొమ్మును మాత్రమే నూతన ఆలయాల నిర్మాణానికి వినియోగిస్తున్నారని, పేదలకు చేయవలసిన సహాయం ప్రభుత్వం చేస్తుందని చెప్పారు. అంతగా సేవ చేయాలని అనిపిస్తే పేదలకు మీ దగ్గర ఉన్న సొమ్ముతో చేసుకోవాలని సూచించారు. సమావేశంలో బీజేపీ నాయకులు కె.శ్రీకాంత్, సుబ్బారావు, బాషా, అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణారావు

సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలి



కంభం : వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కంభం: విద్యార్థి దశ నుంచే సైన్స్‌పై అవగాహన పెంపొందించుకోవాలని ఎంఈఓ అబ్దుల్ సత్తార్ సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి వాల్‌పోస్టర్లను ఎంఈఓ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీయడానికి పోటీ పరీక్షలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. జన విజ్ఞాన వేదిక మండల శాఖ అధ్యక్ష, కార్యదర్శులు వరికుంట్ల వెంకటేశ్వర్లు, రమణారెడ్డి మాట్లాడుతూ.. మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లోని 8, 9, 10వ తరగతి విద్యార్థులు ఈనెల 18వ తేదీన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనే విధంగా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు. నవంబర్ 1న మండల స్థాయి, 23న జిల్లా స్థాయి, డిసెంబర్ 12,13,14వ తేదీల్లో రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో నాయబ్ రసూల్, మస్తాన్, అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొనకనమిట్ల: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి పాఠశాలల స్థాయిలో నిర్వహించనున్న చెకుముకి సైన్స్ సంబరాలపై మంగళవారం మర్రిపాలెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎం నాగేశ్వరరావు పర్యవేక్షణలో సైన్స్ టీచర్స్ మండ్ల రామాంజనేయులు, ప్రతిమ చెకుముకి సంబరాల నిర్వహణ, విద్యార్థులకు నిర్వహించబోయే ప్రతిభా పరీక్షలపై అవగాహన కల్పించారు. అనంతరం 8వ తరగతి విద్యార్థులతో కలిసి చెకుముకి సంబరాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మర్రిపాలెంలో చెకుముకి పోస్టర్లు ఆవిష్కరిస్తున్న టీచర్లు, విద్యార్థులు

అందని బిల్లులు.. సర్పంచ్‌లు ఘొల్లు!

- పంచాయతీలకు బిల్లుల చెల్లింపులో పాలకుల నిర్లక్ష్యం
- నిధులు జమయ్యి నెల అయినా స్పందించని అధికారులు
- ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ సర్పంచ్‌ల ప్రదక్షిణ



తర్లుపాడు ఎంపీడీఓ కార్యాలయం

తర్లుపాడు: కూటమి ప్రభుత్వంలో పంచాయతీల పాలన ఇప్పటికే గాడితప్పగా.. సర్పంచ్‌లకు అవమానాలు నిత్యకృత్యమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన 15వ ఆర్థిక సంఘం నిధులు గత నెలలో పంచాయతీ ఖాతాలకు జమ అయినప్పటికీ బిల్లులు చేసేందుకు అధికారులు ససేమిరా అంటున్నారు. ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో లక్షల రూపాయలు వెచ్చించి సర్పంచ్‌లు పనులు చేశారు. దీంతో తమ బిల్లుల కోసం ఎంపీడీఓ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. వర్షాకాలం మొదలై అంటువ్యాధులు, జ్వరాలు ప్రబలి గ్రామాల్లో ప్రజలు ఇప్పటికే నానా అవస్థలు పడుతున్నారు. గ్రీన్ అంబాసిడర్ల వేతనం, కరెంటు బిల్లులు, డీప్‌బోరు రిపేర్లు, పారిశుధ్య పనులు చేపట్టేందుకు సర్పంచ్‌లకు నిధుల సమస్య ఏర్పడింది. కాగా ఇప్పటికే ప్రభుత్వం పంచాయతీలకు లక్షల రూపాయల బకాయిలు పడింది. ఈ నేపథ్యంలో ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసి వెంటనే బిల్లులు చేయాలని సర్పంచ్‌లు డిమాండ్ చేస్తున్నారు.

వెంటనే బిల్లులు చెల్లించాలి



గ్రామాల్లో తాగునీరు, పారశుధ్య పనులు చేపట్టేందుకు ఇబ్బందిగా ఉంది. వర్షాకాలం కావడంతో కాలువల్లో పూడికతీత, బ్లీచింగ్ చల్లేందుకు నిధులు లేవు. ఇప్పటికే లక్షల రూపాయలు పంచాయతీలో పనులకు ఖర్చు చేశాం. గ్రీన్ అంబాసిడర్లు, కరెంటు బిల్లులకు లక్షల రూపాయల్లో బకాయిలు పడ్డాం. ఆర్థిక సంఘం నిధులు డ్రా చేసుకునేందుకు అధికారులు సహకరించాలి.

– పెద్ద మస్తాన్, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు

నిర్లక్ష్యం తగదు



లక్షల రూపాయలు వెచ్చించి పంచాయతీల్లో పనులు చేపట్టాం. గత నెలలో పంచాయతీ ఖాతాలకు ఆర్థిక సంఘం నిధులు జమయ్యాయి. నిధులు డ్రా చేసుకునేందుకు మండల కార్యాలయానికి వస్తే అధికారులు అందుబాటులో ఉండటం లేదు. పంచాయతీల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు పనులు చేయాలంటూ ఒత్తిడి చేయడం వల్లే లక్షల రూపాయలు ఖర్చు చేశాం. వెంటనే బిల్లులు చెల్లించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలి.

– జాన్‌రత్నం, సర్పంచ్, తాడివారిపల్లి

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి: స్థానిక 33/11 కేవీ పొదిలి రోడ్డు సబ్‌స్టేషన్ పరిధిలో ఉండే 33 కేవీ నూతన లైన్ ఏర్పాటు చేస్తున్నందున పట్టణంలోని పొదిలి రోడ్డు, అద్దంకి రోడ్డులోని డిగ్రీ కళాశాల ఏరియా, కురిచేడు రోడ్డు, తూర్పు చౌటపాలెం రోడ్డు, టీచర్స్ కాలనీ, శివరాజనగర్ ఏరియాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి విద్యుత్ శాఖకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

తాళ్లూరు: మండలంలోని దోసకాయలపాడు సబ్ స్టేషన్ పరిధిలో ఆర్డీఎస్ పనులు చేపడుతున్న కారణంగా బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఏఈ రామకృష్ణారెడ్డి తెలిపారు. గ్రామస్తులు, వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.